క్లుప్తంగా

ఘనంగా నిర్వహించాలి

స్టేషన్‌ఘన్‌పూర్: జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాటుపడాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శనివారం ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ తన జీవితాన్ని మాదిగ సమాజం కోసం అంకితం చేశారన్నారు. ఎంఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గద్దల కిషోర్, నాయకులు సుధాకర్, గడ్డం సోమరాజు, ఉదయ్‌కిరణ్, కొడిదేటి కుమార్, చాడ ఏలియా, ఆదాం, గుర్రం నవీన్, గాదె శ్రీధర్, అశోక్, మంద శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థిని ఎంపిక


కీర్తన

జఫర్‌గఢ్: హిమ్మత్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని అనుముల కీర్తన ఈ ఏడాది ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం మంగు జయప్రకాష్ శనివారం తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన కీర్తనను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

సరుకుల అందజేత



జనగామ: పట్టణంలోని కుర్మవాడకు చెందిన పర్వ మల్లయ్య–లక్ష్మీ కుటుంబ సభ్యులకు గుడాల భూమయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారులు, ఎన్ఆర్ఐలు శ్రీనివాస్, వేణు, శ్రీధర్ జనగామకు చెందిన కాసాల సంతోష్ కుమార్ శనివారం నిత్యావసర సరుకులు అందజేశారు. సంతోష్ మాట్లాడుతూ మల్లయ్య కుమారుడి ఆరోగ్య పరిస్థితి బాగోలేక పోవడంతో ఎన్ఆర్ఐలు జనగామకు వచ్చిన సమయంలో చలించి మూడేళ్లుగా వారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను అందించడం జరుగుతుందన్నారు. ఎన్ఆర్ఐలను పలువురు అభినందించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు


ముత్యం చెరువును పరిశీలిస్తున్న ఎస్సై

దేవరుప్పుల: ప్రజాప్రయోజనార్థం నిర్దేశిత ప్రభుత్వ సామూహిక భూములు ఎవరూ ఆక్రమించినా చట్టపరమైన చర్యలకు గురవుతారని ఎస్సై ఊర సృజన్‌కుమార్ అన్నారు. ఇటీవల అప్పిరెడ్డిపల్లె ముత్యం చెరువులో లింగాలఘనపురం మండలం చీటూరు గ్రామ పట్టాదారు పుస్తకం పేరిట కబ్జా చేసేందుకు వచ్చిన తీరుపై గ్రామస్తులు తహసీల్, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేయగా సందర్శించారు. తహసీల్ అధికారుల పర్యవేక్షణలో వాస్తవాలు తేల్చి చెరువు పరిరక్షణకు చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్సై సూచించారు. మాజీ సర్పంచ్‌లు పులిగిల్ల మల్లయ్య, సుధాకర్, మహేందర్, సత్యనారాయణ, నర్సయ్య, రామిరెడ్డి, నర్సింగమ్, సోమయ్య పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

● ఇబ్బంది పడుతున్న సిబ్బంది


నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

చిల్పూరు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మరుగుదొడ్లు పనిచేయకుండా నిరుపయోగంగా ఉండంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. 17 గ్రామ పంచాయతీలకు అనుసంధానంగా ఉన్న ఈ కార్యాలయంలోనే గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయం ఉంది. ప్రస్తుతం ఎంపీపీ, సర్పంచ్, ఎంపీటీసీలు లేనప్పటికి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో పాటు కార్యాలయానికి పనిమీద వచ్చే వారు కనీసం మూత్ర విసర్జనకు వెళ్లేందుకు కూడా మరుగుదొడ్లు పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు

● ట్రాక్టర్లతో దున్నిస్తున్న రైతులు
● తొలకరి సద్వినియోగానికి ఆరాటం

కొడకండ్ల: పంటల సాగులో చీడపీడల నివారణతో పాటు సమగ్ర పంటల సస్యరక్షణకు గాను రైతులు ముందస్తు చర్యలు చేపడితే ప్రయోజనం చేకూరుతుందనే ఉద్దేశ్యంతో రైతులు వేసవి దుక్కులు దున్నిస్తున్నారు. ముందస్తుగా వేసవి దుక్కులు దున్నించడంతో బహుళ ప్రయోజనాలు పొందేందుకై రైతులు దృష్టి సారిస్తున్నారు. తొలకరిని సద్వినియోగం చేసుకునేందుకు రైతులు ఆరాటపడుతున్నారు.

లోతు దుక్కులతో ప్రయోజనం

లోతు దుక్కులు దున్నుకోవడం వలన ఎంతో ప్రయోజనం ఉంటుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూమిలో ఉండే పురుగులు, తెగుళ్లను నశింపజేసే అవకాశం ఉంటుందని, భూమిలో దాగి ఉన్న నిద్రావస్థలో ఉన్న పురుగులు, తెగుళ్లను కలుగజేసే శిలీంద్రాలకు సూర్యరశ్మి సోకి నశిస్తాయంటున్నారు. దుక్కిలో బయట పడిన గుడ్లు, ప్యూపాలను పక్షులు తిని నాశనం చేస్తాయని, దీంతో తొలకరిలో వేసే పైర్లకు వీటి తాకిడి తగ్గే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులంటున్నారు. భూమిలో తొమ్మిది అంగుళాల వరకు లోతు తగ్గకుండా దుక్కులు దున్నుకోవడం మంచిదని రైతులకు సూచిస్తున్నారు. పంట కోతల తర్వాత నేలపై మిగిలిన పంటల మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు వివిధ రసాయన సేంద్రియ పదార్థాలన్ని కూడా లోతుగా దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోయి నేల సారవంతమవుతుంది. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరిగే అవకాశం ఉంటుంది. వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు చేకూరే అవకాశం ఉండటంతో పాటు తొలకరిని సద్వినియోగం చేసుకోవాలనే ఆరాటంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా వేసవి దుక్కులను దున్నించుకొని సిద్ధం చేసుకొంటున్నారు.


ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

కలుపు నిర్మూలనకు అవకాశం



వేసవి దుక్కులు దున్నడం ద్వారా రైతులకు మంచి ప్రయోజనం చేకూరుతుంది. తుంగ, గరిక వంటి కలుపు మొక్కలు పెరిగి పంటలను నాశనం చేయడమే కాకుండా కలుపు మొక్కలు నీటిని, పోషక పదార్థాలను గ్రహించి సత్తువ లేకుండా చేస్తాయి. దీని వలన భూసారం తగ్గడమే కాకుండా భూమిలోని లోతైన పొరల్లో తేమ తగ్గుతుంది. తుంగ, గరిక వేర్లు దుబ్బుగా ఉండి నేలలో బాగా విస్తరించి ఉండటం వలన కలుపు నివారణ కష్టమవుతుంది. వేసవిలో దుక్కి బాగా దున్నినపుడు ఈ కలుపు వేర్లు దుంపలు ఏరి వీటిని అరికట్టవచ్చు.

– విజయ్‌రెడ్డి, వ్యవసాయాధికారి

పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

జఫర్‌గఢ్: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ రాపర్తి రమ కోరారు. హిమ్మత్‌నగర్ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. హెచ్ఎం మంగు జయప్రకాశ్, ఉపాధ్యాయులు పసునూరి కవిత, కడారి వసంత, గాదె వెంకటస్వామి, వెంగల జితేందర్, పొరిక మంజుల, భూక్యా వంశీకృష్ణ, ప్రశాంత తదితరులు పాల్గొన్నారు.

ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం

ఏసీపీ నర్సయ్య


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ నర్సయ్య

పాలకుర్తి టౌన్: ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం అని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య అన్నారు. శనివారం నేను సైతం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా, గూడూరు, రాఘవాపురం గ్రామాల్లో దాత పగడాల శ్రీధర్ సహకారంతో 64సీసీ కెమెరాలను, పాలకుర్తి వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆరు కెమెరాలను ఏర్పాటు చేయగా ఏసీపీ నర్సయ్య ప్రారంభించి మాట్లాడారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, దాతలు శ్రీధర్, చారగోండ్ల ప్రసాద్, ఇమ్మడి వీరన్న, బోనగిరి కృష్ణమూర్తి, నంగునూరి రవీందర్, పన్నీరు సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ సమావేశంలో తనకు ఇల్లు రాలేదని అడిగిన శివునిపల్లికి చెందిన పుంజూరి రజితను పోలీసులు నెట్టివేయగా ఆమె గాయపడిన విషయం తెలుసుకున్న డాక్టర్ రాజయ్య శివునిపల్లిలో శనివారం ఆమెను పరామర్శించారు. రజితనాగరాజు ఇంటితో పాటు గ్రామంలోని పలువురు పేదలకు చెందిన ఇళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలు ఉన్నారని, ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు కాదని అనర్హులకు కేటాయించారన్నారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్లపై రీసర్వే చేయాలని, అర్హులకు న్యాయం చేయాలన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, నాయకులు కనకం గణేష్, ఆకుల కుమార్, తాటికొండ సురేష్, గుర్రం శంకర్, ఆగారెడ్డి, పెసరు సారయ్య, మారెపల్లి ప్రసాద్, చిట్టిబాబు, గుర్రం శ్రీను, సంకెళ్ల రవి, గుండె మల్లేష్, చింత శ్రీను, రేగుల శ్రీను పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


స్టేషన్‌ఘన్‌పూర్: ఫుట్‌బాల్ శిక్షణ పొందిన విద్యార్థులతో అతిథులు

స్టేషన్‌ఘన్‌పూర్: క్రీడల ద్వారా దేహదారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఫాదర్ కొలంబో స్కూల్ హెచ్ఎం, కరస్పాండెంట్ ఫాదర్ వై.థామస్‌కిరణ్ అన్నారు. జిల్లా యూత్ స్పోర్ట్ ఆఫీసర్ వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ కళాశాల, ఫాదర్ కొలంబో స్కూల్ మైదానంలో పీడీ, ఫుట్‌బాల్ కోచ్ సింగపురం మహేష్ ఆధ్వర్యంలో గత నెల 1వ తేదీ నుంచి నిర్వహించిన ఉచిత ఫుట్‌బాల్ శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విజయవంతంగా శిక్షణ శిబిరాన్ని పూర్తి చేసిన కోచ్ మహేష్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులకు శిక్షణకు సంబంధించిన సర్టిఫికెట్లను అందించారు. మాజీ ఎంపీటీసీ సింగపురం దయాకర్, కోచ్ సింగపురం మహేష్, పీఈటీ రమేష్, గుండె మల్లేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా క్రీడా, యువజన శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా కోచ్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పీఏసీఎస్ మాజీ చైర్మన్ గట్టు రమేష్ మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా జరిగాయన్నారు. ఈ మేరకు కోచ్ రాజును ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందించారు. పీడీ వంచ చంద్రశేఖర్‌రెడ్డి, గజ్జెల్లి రాజు, గట్టు చేరాలు, గట్టు మనోహర్, తాటికొండ రమేష్ పాల్గొన్నారు.

పోల్ టాక్స్‌ను రద్దు చేయాలి

రఘునాథపల్లి/చిల్పూరు: కేబుల్ టీవీ ఆపరేటర్ల మీద విద్యుత్‌శాఖ వారు బలవంతంగా వసూలు చేస్తున్న పోల్ టాక్స్‌ను రద్దు చేసి ఆదుకోవాలని మండల కేబుల్ అపరేటర్లు శనివారం ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి వినతి పత్రం అందజేశారు. మండల కేబుల్ అపరేటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాలపూరి రాజేందర్ ఆధ్వర్యంలో హనుమకొండలో ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు రాజేందర్ తెలిపారు. సంఘం నాయకులు బాలపురి రాజేందర్, పుల్యాల రాజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఖలీల్, యుగందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్

సాక్షి నెట్‌వర్క్: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను ముస్లింలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మజీద్‌లలో, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అలయ్–బలయ్‌తో శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంతో పాటు జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్లు, ఈద్గాలు, మజీద్‌ల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ముస్లిం మతపెద్దలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


జనగామ: ప్రార్థన చేస్తున్న చిన్నారులు


నర్మెట: ప్రార్థనలో పాల్గొన్న ముస్లింలు


చిల్పూరులో..


స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న ఇమామ్


తరిగొప్పుల: బక్రీద్ వేడుకల్లో పాల్గొన్న ముస్లింలు


దేవరుప్పుల: ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సీఐ మహేందర్‌రెడ్డి


రఘునాథపల్లిలో..


కొడకండ్లలో..


బచ్చన్నపేటలో..

సాయం రెట్టింపు చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

జనగామ రూరల్: భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చే ఆర్థికసాయం రెట్టింపు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో సుద్దాల యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. అచ్యుత్, చెల్లోజు మల్లేశం, లింగాల రాములు, గోల్కొండ నాగరాజు, చామకూర యాకూబ్, దయ నాగేష్, సిద్దులు, రాములు, ప్రభాకర్, భుక్య సంపత్ పాల్గొన్నారు.

సన్నబియ్యం కోసం బారులుదీరిన లబ్ధిదారులు


నర్మెట: రేషన్‌షాపు ఎదుట ఉదయాన్నే బారులుదీరిన లబ్ధిదారులు

నర్మెట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందిస్తున్న సన్నబియ్యం కోసం రేషన్ షాపుల ముందు లబ్ధిదారులు బారులుదీరుతున్నారు. కేంద్రం ఒక్కరికి 5 కేజీలు, రాష్ట్ర ప్రభుత్వం ఒక్కరికి కేజీ బియ్యం అందిస్తుండగా జూన్, జూలై, ఆగస్టు కోటాను ఒకేసారి అందిస్తుండటంతో లబ్ధిదారులు ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో డీలర్లు ఒక్కసారి వేలి ముద్రలు తీసుకుని లబ్ధిదారులకు బియ్యం అందించేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కోటాకు విడివిడిగా వేలు ముద్రలు తీసుకోవడం, మూడు నెలల బియ్యం ఒకేసారి ఇవ్వడంతో ఆరు మార్లు వేలిముద్రలు (థంబ్) తీసుకోవడంతో చాలా సమయం పడుతోంది. మండలంలో 17 రేషన్ షాపులు, 7,529 కార్డులు ఉండగా 142.439 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. నెలరోజుల సమయం ఉన్నందున లబ్ధిదారులు సహకరించాలని బియ్యం అందుతాయో లేదోనని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీలర్లు, అధికారులు తెలుపుతున్నారు.

సంక్షిప్త సమాచారం

ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో బొమ్మెళ్ల సుజాత–నర్సయ్య దంపతుల కూతురు భవాని వివాహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజికవేత్త జంగిటి విద్యానాథ్ రూ.5వేల సాయం శనివారం అందజేశారు. అలాగే పార్టీ యువ నాయకుడు జిల్లా సందీప్‌గుప్తా రూ.5వేలు ఇచ్చారు. నల్లనాగుల వెంకటాచారి, మహాత్మాచారి, బాలకిషన్‌గౌడ్, బాలరాజు, నారాయణరెడ్డి, రాందాస్,వేణువందన, రాజయ్య, రవి, శ్రీనివాస్, హరీష్, నాగరాజు పలువురు పాల్గొన్నారు.

తమ్మడపల్లిలో..

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (జి) గ్రామానికి చెందిన ఉప్పునూతల లక్ష్మణ్ భార్య మౌనిక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న 2003–2004 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు దహన సంస్కారాలు నిర్వహించడంతో పాటు దశదినకర్మకు 50 కిలోల బియ్యం, ఆర్థికసాయం శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి..

స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ గ్రామానికి చెందిన పొన్నబోయిన వజ్రమ్మ ఇటీవల మృతి చెందింది. కాగా, బాధిత కుటుంబాన్ని గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి రూ.5వేల సాయం అందించారు. పండుగ బద్రి, నారబోయిన శ్రీనివాస్, కుమార్, సంపత్, సతీష్, మల్లేశం, తిరుమలేష్, సాగర్, రాజు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో పడమర కొండపై వెలసిన లక్ష్మీనర్సింహస్వామి ఉత్సవాలు నేటి (ఆదివారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ అర్చకుడు పోడిచేటి వెంకటాచార్యులు తెలిపారు. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు స్వామివారి జయంతి ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. వేడుకల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయంవంతం చేయాలని ఆయన కోరారు.

విజయవంతం చేయాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రజక సంఘం నాయకులు

పాలకుర్తి: రజకులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని కోరుతూ ఈనెల 17న హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదునూరి మదార్ అన్నారు. ఈ మేరకు శనివారం గూడూరు గ్రామంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన నాయకులతో కలిసి ఆవిష్కరించారు. జ్యోతి యాదగిరి, లొంక రజాక్, అంజయ్య, పరశురాములు, జ్యోతి సోమయ్య, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఏకాదశి పూజలు



బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. పరమశివుడికి ప్రీతికరమైన రోజు ఏకాదశి తిథి కావడంలో ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని కేసిరెడ్డిపల్లి, బండనాగారం, కట్కూర్ పలు గ్రామాల్లో రాత్రి వేళ నగర సంకీర్తన చేశారు.

ఉపాధ్యాయులను పట్టించుకోని ప్రభుత్వం

పాలకుర్తి: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉద్యోగులను రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఐదు డీఏలకు ఒకటే ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. హామీలు నెరవేర్చడంలో సీఎం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

బొడ్రాయికి జలాభిషేకం


నీటి బిందెలతో మహిళలు

చిల్పూరు: మల్కాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠించి శనివారంతో పదేళ్లు పూర్తి అయిన సందర్భంగా మహిళలు జలాభిషేకం చేశారు. ఉదయం అర్చకులు చొల్లేటి రాజేశ్వర శర్మ వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజల అనంతరం మహిళలు జలాభిషేకం చేసేందుకు బిందెలతో బారులుదీరారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

లింగాలఘణపురం: నవాబుపేట, నాగారం, లింగాలఘణపురం గ్రామాల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ బ్యాటరీలు చోరీ చేసినట్లు బాధితులు తెలిపారు. రైతులు వ్యవసాయ బావుల వద్ద పొలాలు దున్ని అక్కడే ట్రాక్టర్లను పెట్టి రావడంతో గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 12 ట్రాక్టర్ల బ్యాటరీలు ఎత్తికెళ్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం కూడా ఇదేవిధంగా ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి.

ఐఎన్‌టీయూసీ నాయకుడు భిక్షపతి మృతి


సంతాపం తెలుపుతున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన ఐఎన్‌టీయూసీ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ లైన్ ఇన్‌స్పెక్టర్ మచ్చ భిక్షపతి (68) కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఐఎన్‌టీయూసీ నాయకులు ఘన్‌పూర్‌లో భిక్షపతి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూనియన్‌లో విశేష సేవలు అందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఐఎన్‌టీయూసీ 327 యూనియన్ స్టేట్ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, నాయకులు చంద్రశేఖర్, గబ్బెట సుధాకర్, వాసం శ్రీధర్‌పటేల్, ఎండీ.అన్వర్‌పాషా, సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా గుంత


ప్రమాదకరంగా ఉన్న గుంతలో నిలిచిన నీరు

బచ్చన్నపేట: మండలంలోని లింగంపల్లిగ్రామంలో ములుపు వద్ద మేయిన్ రోడ్డుపై గుంత పడి ప్రమాదకరంగా మారింది. బచ్చన్నపేట నుంచి లింగంపల్లి మీదుగా గజ్వేల్, యాదాద్రి, హైదరాబాద్, రాజపేటకు వాహనాలు వెళ్తుంటాయి. లింగంపల్లిలో మూల ములపు వద్ద గుంత ఏర్పడటంతో అందులో వర్షపు నీరు చేరి కనిపించక వాహనాలు అదుపుతప్పుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని ప్రమాదకర గుంతను పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.